జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 5-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 300 పేజీలు: 4 వెల : రూ.7

## సమస్యలు చెప్పండి..
# పరిష్కరిస్తాను

* వారం రోజుల్లో ఖాళీలు భర్తీ చేస్తాం * అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతాం * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్ * వివిధ విభాగాల తనిఖీ * వైద్యసేవలపై ఆరా



**శ్రీకాకుళం, ఏప్రిల్4 (వార్త):** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని, రోగులకు వైద్యసేవలు సకాలంలో సక్రమంగా అందాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆయన సందర్శించి సమీక్షించారు. పలు విభాగాలను సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో సేవలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. కొన్ని మందులు అందుబాటులో లేవని ఫిర్యాదులు వచ్చాయని, ఆ సమస్యను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఆసుపత్రిలో ఏయే ఖాళీలు ఉన్నాయో తన దృష్టికి వస్తే వారం రోజుల్లో తన పరిధిలో వారం రోజుల్లో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, సక్రమంగా సేవలు అందించాలన్నారు. అంతకుముందు ఎముకల విభాగాన్ని సందర్శించి పేషెంట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. రన్నింగ్ వాటర్ వస్తున్నది లేనిది పరిశీలించారు. కాంట్రాక్టు బేసిస్ సిబ్బంది గూర్చి ఆరా తీశారు. శానిటేషన్ డిసియస్ ఆర్ఎంఓ బాను ప్రకాష్‌ను కలెక్టర్ అడుగగా సిబ్బంది చేస్తున్న పనులను వివరించగా సిబ్బంది అంతా సమయానికి వస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఓపి రిజిస్ట్రేషన్‌ను సందర్శించి ఒక ఓపికి ఎంత సమయం పడుతుందని ఆరా తీశారు. ఆర్థో విభాగంలో మేల్, ఫిమేల్ వార్డులో పార్టీషన్ ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వాటర్ అదనంగా అవసరం అవుతుందని సూపరింటెండెంట్ చెప్పగా ఒక బోర్ తీయించాలని ఎపిఎంఎస్ఐసిడి ఈఈని ఆదేశించారు. మార్చురి ఫ్లోరింగ్‌పై చెప్పగా ఫ్లోరింగ్ అంతా కిందకు దిగిపోయిందని, మూడు నెలల వరకు సమయం పడుతుందని ఈఈ కలెక్టర్‌కు వివరించారు. పేషెంట్లకు భోజనాలు సరఫరా చేసే స్థలం, తదితర వాటిపై చర్చించారు. ఎంఆర్ఓ స్కానింగ్ వద్ద వాటర్ వస్తోందని చెప్పగా గ్రౌండ్ వాటర్ డిడిని పరిశీలించి రిపోర్ట్ అందజేయమని ఆదేశించారు. టెక్కలి నుండి వచ్చే రిఫరల్, నేరుగా వచ్చే పేషెంట్స్ జాబితా అందజేయాలని ఆర్ఎంఓ ను ఆదేశించారు. సదరం కేంద్రాన్ని సందర్శించి సర్టిఫికెట్లు పరిశీలనకు వచ్చే వారి వివరాలు అడిగి తెలుసుకొని ఒక్కొక్కరిని ఏ విధంగా పంపిస్తున్నారని అడుగగా విభాగాల వారీగా, క్రమ సంఖ్య వారీగా పంపుతున్నట్లు సూపరింటెండెంట్ షకీలా వివరించారు. వచ్చే వారికి తాగునీరు ఏర్పాటు చేయమని చెప్పగా ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. తాగునీరు పాయింట్లు ఏర్పాటు చేశారు కాని నీరు లేదని, చిన్న చిన్న సమస్యలను రెక్టిఫై చేసుకోవాలని ఆదేశించారు. పలు సమస్యలపై చర్చించి సూచనలు జారీ చేశారు. కలెక్టర్ వెంట సియస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత, డిసియస్ ఆర్ఓ డాక్టర్ సుభాషిని, సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, డాక్టర్ శ్రీదేవి, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## కోటి 19 లక్షలకు..
# లెక్క చెప్పాల్సిందే!

* మూలపేట సర్పంచ్‌ను వదిలేది లేదు * వెంటనే సర్పంచ్‌పై కేసులు కట్టండి * టీడీపీ సంతబొమ్మాళి మండల అధ్యక్షుడు, మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు * నౌపడ పోలీస్‌స్టేషన్ ముట్టడి * పోలీసులతో టీడీపీ నేతల వాగ్వాదం

**సంతబొమ్మాళి, ఏప్రిల్4 (వార్త):** మూలపేట గ్రామానికి సంబంధించిన రూ.కోటి 19 లక్షల లెక్కలు ప్రస్తుత సర్పంచ్ జీరు బాబురావు చెప్పాల్సిందేనని మాజీ సర్పంచ్, టీడీపీ సంతబొమ్మాళి మండల అధ్యక్షుడు జీరు భీమారావు అన్నారు. నౌపడ పోలీస్ స్టేషన్‌ను గ్రామస్తులతో కలిసి శుక్రవారం ముట్టడించారు. మూలపేట గ్రామానికి చేపల కట్టు వేలంపాట ద్వారా, ఇతర మార్గాల ద్వారా ప్రతి ఏడాది లక్షల్లో ఆ గ్రామానికి ఆదాయం వస్తుంటాది. 15 ఏళ్లుగా టిడిపి నాయకుడు కోట నారం నాయుడు ఆధీనంలో గ్రామం డబ్బులు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సర్పంచ్ జీరు బాబురావు చేతికి ఈ డబ్బులు చేరాయి. అయితే మరల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది నిర్వహించిన చేపలు కట్టు వేలంపాట ద్వారా వచ్చిన సుమారు రూ.40 లక్షల టీడీపీ నాయకుడు కోట నారం నాయుడు చేతిలోకి వెళ్లిపోయింది. అయితే గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్ బాబురావు దగ్గర ఉన్న గ్రామం సొమ్ము లెక్కలు చెప్పి తమకు అప్పజెప్పాలని టిడిపి నాయకులు కోరారు. గత 15 సంవత్సరాలుగా మీ దగ్గర ఉన్న డబ్బులు లెక్క చెప్తే నేను కూడా లెక్క చెప్తానని, లెక్కలు అడిగితే వాయిదాలు వేయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో నౌపడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీస్ స్టేషన్‌లో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, నౌపడ ఎస్సై నారాయణస్వామి ఎదుట టిడిపి నాయకులు సర్పంచ్ జీరు బాబురావుపై మండిపడుతూ రెచ్చిపోయారు. ఊరికి మాకు సంబంధం లేదని సర్పంచ్ బాబురావు అంటున్నారని రేపు ఏం జరిగినా మీరు ఎంటర్ కావద్దని పలుమార్లు పోలీసులకు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు, మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు హెచ్చరించారు. మీ అందరూ వచ్చి ఇక్కడ అరవడం వల్ల లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందని ఎస్ఐ చెప్పిన



వినిపించుకోకుండా మేమంతా పబ్లిక్ అని పోలీసులకు సమాధానం ఇచ్చారు. మూలపేట గ్రామానికి సంబంధించిన కోటి 19 లక్షలు సర్పంచ్ బాబురావు కాజేసాడని నాలుగు నెలల క్రితమే టెక్కలి సిఐకు, నౌపడ పోలీసులకు లా అండ్ ఆర్డర్ భంగం కలుగుతుందని ఆ రోజే దృష్టికి తెచ్చినా పోలీసులు పట్టించుకోలేదని భీమారావు తెలిపారు. అందుకే గ్రామస్తులమంతా మూకుమ్మడిగా నౌపడ పోలీస్ స్టేషన్ కు వచ్చామన్నారు. అవసరమైతే సీఐని కూడా నిర్బంధిస్తామని హెచ్చరించారు. గ్రామానికి సంబంధించిన డబ్బుల లెక్క సర్పంచ్ బాబురావు చెప్పాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గ్రామాన్ని ఖాళీ చేయమని మేము మారం... మా ఊరు వదలబోమన్నారు. ఎవరికి డబ్బులు ఇచ్చారని ఇల్లు ఖాళీ చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సంబంధించిన ప్రతి ఒక్క రూపాయి లెక్క చెప్పకపోతే శనివారం 2000 మందితో వస్తామన్నారు. మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో చివరకు పోలీసులు శనివారం సర్పంచ్ బాబురావు వచ్చి లెక్కలు చెబుతారని నచ్చచెప్పడంతో టీడీపీ నాయకులు, గ్రామస్తులు వెళ్లిపోయారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ఎల్ఎన్‌పేట, ఏప్రిల్ 4 (వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు, లయన్ డా.మిశ్రో విద్యార్థులకు జనపనారతో తయారుచేసిన పౌచ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయం ఎస్ఓ ఎం.వి.అంబికా, గ్రామ రెవెన్యూ కార్యదర్శి రమణమ్మ, ఉపాధ్యాయులు ఉపేంద్ర. సునీత పాల్గొన్నారు.

## ఏపీసీఎన్ఎఫ్ డీపీఎంగా పూజారి



**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త):** ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీసీఎన్ఎం)గా పూజారి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలి అభివృద్ధి

*** టెక్కలి డిగ్రీ కళాశాల కాంపౌండ్ కు రూ.2 కోట్లు * పట్టుమహదేవుకోనేరు ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా * అన్యాక్రాంత దేవాలయ భూముల్లో కల్యాణ మండపం నిర్మిస్తాం * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * రోడ్డు పనులకు శంకుస్థాపన**



**టెక్కలి, ఏప్రిల్ 4(వార్త):** జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి వరకు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు, టెక్కలి నుంచి చెట్లతాండ్ర వరకు రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు, ఆలాగే టెక్కలి అంబేద్కర్ జంక్షన్ తోలుసూరుపల్లి రోడ్డు దగ్గర భగవాన్ పురం-చెట్లతాండ్ర రోడ్డు, వయా భగవాన్ పురం, ఆరికివలస మీదుగా చెట్లతాండ్ర గ్రామం వద్ద, వయా డీజీ పురం, కోటబొమ్మాళి చెరువు వద్ద కోటబొమ్మాళి- సంతబొమ్మాళి రోడ్డులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమం ముందుకు తీసుకువెలుతునట్లు తెలిపారు. టెక్కలి అభివృద్ధిని జిల్లా కేంద్రానికి దీటుగా అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు పడితే రెండు వైపులా నుండి రాలేదని పరిస్థితిని గూర్చి వివరించారు. కల్వర్టు మంజూరు చేయడమైనదని, రైల్వే ట్రాక్ తో సంబంధం లేకుండా నేరుగా జాతీయ రహదారికి వెళ్లొచ్చని చెప్పారు. టెక్కలి నుండి దండుగోపాలపురం వరకు గతంలో మంజూరు చేసిన రోడ్డు ఉందన్నారు. టెక్కలిలో డిగ్రీ కళాశాల ఉందని ప్రహరి లేక పశువులు ప్రవేశించి కళాశాలను పాడుచేస్తున్నాయని, రూ.2 కోట్ల తో కాంపౌండ్ ఏర్పాటు చేస్తామని, త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. గతంలో తాను టెక్కలి ప్రధాన రహదారిని వేయడమైనదని, రూ.3 కోట్లతో డివైడర్‌లలో మంచి మొక్కలు, రోడ్లుకు ఇరువైపుల కాలువలు నిర్మిస్తామన్నారు. అన్నా కేంటిన్ అభివృద్ధి గూర్చి ఎవరూ ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, స్కూల్ రీ ఓపెన్ నాటికి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీని పూర్తి చేస్తామన్నారు. అమ్మకు వందనం కింద ఒకే ఇంటిలో ఎందరు పిల్లలు చదువుకుంటే ఉంటే అందరికీ 15 వేలు రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతు పెట్టుబడి కింద ఇరవై వేలు రూపాయలు త్వరలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతల వారీగ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విడతల వారీగా అన్ని పథకాలు అమలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. టెక్కలిలో పేదవారు ఉన్నారని అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూమిని తిరిగి తీసుకొని పేద ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్యాక్రాంతమయిన దేవాలయ భూములులో కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తామన్నారు. అన్యాక్రాంతమయిన ప్రతీ సెంటును తిరిగి ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు. టెక్కలిలో ఎన్టీఆర్ నగర్ లో సిసి రోడ్లు, మండాపురం కాలనీలో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద రహదారి చాలా ఇరుకుగా ఉందని, అందరితో మాట్లాడి వెడల్పు చేసేందుకు మాట్లాడడమైనదని, ఇళ్లు పోయిన వారికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. నిజమైన పేద వారికి పట్టాలు ఉంచి, మిగిలిన లబ్ధిదారులను పరిశీలించాలని ఆర్డీఓను ఆదేశించారు. ప్రతీ పేదవానికి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గం అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. పట్టుమహదేవుకోనేరు ఆలయంను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. టెక్కలిని మున్సిపాలిటీ చేసుకుంటే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణమూర్తి, ఆర్ అండ్ బి ఎస్ఈ కె. జాన్ సుధాకర్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, డిఈఈ రవికాంత్, ఎఈఈ జగదీష్, ఎంపిపిలు జడ్పీటీసీలు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోండి

ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం టెక్కలిలో ఆయన టెక్కలి నుండి అమలాపురం వరకు సూపర్ లగ్జరీ, శ్రీకాకుళం నుండి కొత్తూరు వరకు ఎక్స్ ప్రెస్ సర్వీసులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఆర్ఎం ఎ. విజయ్ కుమార్, టెక్కలి డిఎం శ్రీనివాసరావు, శ్రీకాకుళం - 2 డిపో డిఎం కె.ఆర్.శర్మ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, పిఆర్ఓ సుమన్, ఎంపిపి, జడ్పీటీసీలు, సర్పంచ్, మాజీ ఎంపిపి, జెడ్పిటిసి లు, ట్రాఫిక్ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





## బిలాస్‌పూర్ నృత్య ప్రదర్శనకు ఇచ్ఛాపురం కళాకారులు

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4(వార్త):** మధ్యప్రదేశ్ చత్తీస్ ఘడ్ బిలాస్ పూర్ కూచిపూడి నాట్య ప్రదర్శనకు వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఈనెల 6 7 తేదీలలో ప్రదర్శన ఇవ్వనున్నారు. అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నా గురు స్వామి దంపతులు) నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో నాట్య గురువులు నీలాపు శైలు, చాట్ల జయలక్ష్మి, ఆసిపు శ్వేతా రాణి, కొరివి జాగృతి, చిన్నారులు లిఖిత, జయశ్రీకాత్యాన్ని, పల్లవి, రమ్యశ్రీ, ప్రణవి, సంజన, శ్రీ దీక్షిత, స్రవంతి, నిహారిక, జాహ్నవి నృత్యాలలో పాల్గొంటున్నారు. మొదటిరోజు కూచిపూడి, భరతనాట్యం, రెండవ రోజు ఒరియా సంబల్పూరి, జానపద గీతాలలో పాల్గొంటున్నారు. 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమానికి అవకాశం కల్పిస్తున్న అన్నపూర్ణ తెలుగు సమాజం బృందం వారికి కళాకారులంతా కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలు వినియోగించుకోండి



**పలాస, ఏప్రిల్ 4 (వార్త):** బీసీ కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసు కోవాలని పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్పొరేషన్ రుణాల కోసం మొత్తం 728 దరఖాస్తుల రాగా, అందులో 570 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రుణాలు తీసుకున్న వారంతా వ్యాపారం చేయాలని, మరింతగా అభివృద్ధి చెంది పెద్ద వ్యాపారస్తులుగా కొనసాగాలని కోరారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరైన వారికి వడదెబ్బ తగలకుండా శామియానాలు, తాగునీరును మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేశారు. ఈ ఇంటర్వ్యూలకు మెప్మాకు చెందిన సిటీ మేనేజర్ మోహన్‌రావు, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ బ్యాంకు, కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డీసీసీ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు వివిధ సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లై.. డే

*** మండుతున్న ఎండలు**
*** నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు**
*** 40 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు**
*** వడగాలులతో వృద్ధులు, చిన్నారుల అవస్థలు**
*** బయటకు వస్తే జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు**



**సరుబుజ్జిలి, ఏప్రిల్ 4 (వార్త):** ఎండలు మండుతున్నందున ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. శుక్రవారం ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత అధికమైంది. 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడే ఇలా ఉంటే ముందు ఇంకెలా ఉంటుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

### వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు, కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

### ప్రాథమిక చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. చల్లని గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

### వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన/చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి. ఆల్కాహాల్/సిగరేట్/కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండండి. ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించండి. వేసవిలో ఉదయం/సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి. వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి. ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి. ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిది.

### చేయకూడని పనులు

మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు. రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలి. మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి. నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది. శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి. వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణప్రక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

### బయటకు వెళ్లినపుడు జాగ్రత్తలు పాటించండి



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపి ధరించి వెళ్లాలి. చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే లవణాలతో కూడిన ద్రావణం తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**- డాక్టర్ ప్రియదర్శిని, సరుబుజ్జిలి వైద్యాధికారి**

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కిశోర వికాసం గ్రామ సభలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (వార్త):** ఇచ్ఛాపురం, కవిటి మండలాలతో పాటలు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో గల అంగన్వాడి కేంద్రంలలో కిశోర వికాసం సభలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహ నిరోధక కమిటీ, బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి నెలలో మూడుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణ, చైల్డ్ రైట్స్, హెల్ప్ లైన్ ఆవశ్యకత, స్కూల్‌లలో కంప్లైంట్ బాక్స్ గూర్చి, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో చట్టం గూర్చి వివరించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.




## పాఠ్యపుస్తకాలు పంపిణీ

**నరసన్నపేట, ఏప్రిల్ 4 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టిబాబు, కూటమి నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 13న పైలా వాసుదేవరావు స్మారక సభ




**పలాస, ఏప్రిల్4 (వార్త):** భారత విప్లవోద్యమంలో శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటానికి ప్రత్యేక రాజకీయ విశిష్టత వుందని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ అన్నారు. పలాసలో ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరజీవి పైలా వాసుదేవరావు చరిత్రలో సుస్థిర స్థానం ఉందన్నారు. ఉద్దానంలో పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, పాణిగ్రాహి సుబ్బారావు, చాగంటి భాస్కరరావు, ఏజెన్సీలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి సుప్రసిద్ధ విప్లవ నేతలతో పాటు వందల మంది విప్లకారులను దారుణంగా ప్రభుత్వం పొట్టనపెట్టుకున్న తర్వాత విప్లవోద్యమ పునర్నిర్మాణం ఓ కీలక కర్తవ్యంగా ముందుకు వచ్చిందన్నారు. ఆదశలో పైలా వాసుదేవరావు కీలక పాత్ర పోషించాడని తెలిపారు. సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగి అనేక ముఖ్య బాధ్యతల్ని పోషించారన్నారు. ఆయన మరణించి 15 ఏళ్లు నిండుతుందనీ, ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీ ఆదివారం పలాసలో పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. పలాసలో ఉదయం 10:30 కి స్మారక ప్రదర్శన ప్రారంభమై అప్పయ్య దొర ఇంటి సమీపాన గల గ్రౌండ్ (ఖాళీ స్థలం)లో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభకు పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహిస్తారని, వక్తలుగా కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, వై. కొండయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, వంకల మాధవరావు, పి.రమణి, సన్నశెట్టి రాజశేఖర్, ఎం.వినోద్, గోరకల బాలకృష్ణ, జుత్తు వీరస్వామి ప్రసంగిస్తారన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య బృందం చేత కళా ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

## రెంటికోటలో చలివేంద్రం ప్రారంభం



**పలాస, ఏప్రిల్4 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సూచనలతో రెంటికోట మెయిన్ రోడ్డులో చలివేంద్రాన్ని రెంటికోట వైద్యాధికారి డాక్టర్ ఎస్.మౌనిక, సర్పంచ్ తిరుమలరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దూరప్రాంతాలు వెళ్లేటప్పుడు లేదా పని చేసేటప్పుడు నాలుక పొడిబారిన లేదా చర్మం పొడిబారిన వీలైనంతవరకు ఎక్కువగా నీటిని తీసుకోవాలన్నారు. అలాగే బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని ధరించి వెళ్లాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎండవేడికి తగు జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని కోరారు. వేసవి దృష్టిలో పెట్టుకొని పని ఉన్నప్పుడు ఉదయం 10 గంటల లోపు ముగించుకొని మరలా సాయంత్రం నాలుగు గంటల తర్వాత పనిపై బయటకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు బోనెల గోపాల్ పంచాయతీ సెక్రెటరీ సద్గుణ రావు, మహిళా పోలీస్ వాసంతి ,టిడిపి నాయకులు కరియామంత్ర, పి హెచ్ న్ సత్యవతి, సూపర్వైజర్లు రిషికేశ్వరరావు, ఈశ్వరమ్మ, యుడిసి సుదర్శన్, విమల, ప్రభావతి, త్రివేణి ,యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నా రోల్ మోడల్స్ నా తల్లి, అత్తమ్మలే!

- ✻ తల్లి ప్రోత్సహిస్తే.. అత్తమ్మ బాసటగా నిలిచారు.
- ✻ సామాజిక మాధ్యమాల్లో దాడులను ఎదుర్కొన్నా
- ✻ మహిళలు రాజకీయాల్లోకి రావాలి
- ✻ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష






**పలాస, ఏప్రిల్4 (వార్త):** అన్ని రంగాల్లో ప్రస్తుతం మహిళలు దూసుకుపోతున్నారని, రాజకీయ రంగంలో కూడా మహిళలు చక్కనైన పాత్ర పోషిస్తున్నారని, భవిష్యత్‌లో ఈ రంగంలోకి అధిక సంఖ్యలో మహిళలు రావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకాంక్షించారు. ఒడిశా పర్లాకిమిడిలోని సెంచూరియన్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ 2024–25కు ముఖ్య అతిథిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటిని పరిష్కరించాలనే తపన ఉన్న మహిళలు తప్పనిరిగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. తాను రాజకీయ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు తన కుటుంబం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థులు సామాజిక మాధ్యమాల్లో కించపరుస్తూ తన ప్రతిష్టను దెబ్బ తీసి, వ్యక్తిత్వ హననం చేసి వెనక్కు పంపాలని కుయుక్తులు పన్నారన్నారు. ఒకానొకదశలో వెనక్కి వెళ్లిపోదామనుకున్న తరుణంలో తన తల్లి ప్రోత్సహిస్తే, తన అత్తమ్మ బాసటగా నిలిచారని, తన భర్త భుజం తట్టి ముందుకెళ్ళమని చెప్పినట్టు గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తనను తాను దృడంగా చేసుకుంటూ మరింత రాటు దేలినట్లు చెప్పుకొచ్చారు. ఇక్కడున్న విద్యార్థుల్లోంచే ఎంతోమంది రాజకీయ నాయకులు వచ్చి సమాజానికి సేవ చేయాలని అక్కాక్షించారు. అంతకుముందు విద్యార్థినులంతా ఆమెకు పూలతో ఘన స్వాగతం పలికి చిరు సత్కారం చేశారు.



## మందస వ్యాపారులు, అధికారుల భేటీ

**మందస, ఏప్రిల్ 4(వార్త):** మందస వ్యాపారస్తులపై ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ వేధిస్తోందని, వారి నుంచి రక్షణ కల్పించాలని మందస వర్తక సంఘం సభ్యులు తహశీల్దార్ ఆఫీస్ లో వినతి పత్రం ఇచ్చారు. దీనిపై అధికారులు స్పందించారు. మందస తహశీల్దార్ ఎస్.హైమవతి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సోంపేట సీఐ కె.బేబీ, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో మందస పట్టణంలోని వైశ్య సంఘం భవనంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి గోపాలకృష్ణ, కె.రమేష్ మాట్లాడుతూ మందసలో వర్తకులు నల్లబెల్లం అమ్మడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సారా కాస్తున్నారని, దాని వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపిస్తూ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ మాపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో యువతీ, యువకులు చదువుకున్న వారు ఉన్నారని వాళ్లకు ఉపాధి కల్పించాలని మందసలో ఐటీడీఏను ఏర్పాటు చేసి గిరిజనులను పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిరిజనులకు మద్యపాన నిషేధం పై అవగాహన కల్పించి వాళ్లని చైతన్య పరచడం ద్వారా సమస్యను పరిష్కారం అవుతుందన్నారు. ఎటువంటి నల్ల బెల్లమును అమ్మడం లేదని అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే అధికంగా సారా కాస్తున్నారని, వ్యాపారులు ప్రభుత్వానికి సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కె.నరేష్, కె.మహేష్, శ్రీను, వడ్డి శ్రవణ్, త్రినాధ్, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**కొత్తూరు, ఏప్రిల్4 (వార్త):** ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కళాశాల ద్వితీయ సంవత్సరం తరగతుల ప్రారంభం రోజునే విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాక్రిష్ణన్ పథకం ద్వారా ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తూరు జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ అధ్యక్షతన మండల వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకులు లోతుగడ్డ తులసీ వర ప్రసాద్ నాయుడు, మండల టీడీపీ పార్టీ నాయకులు అగతముడి మాధవరావు, మాతలగాంధీ, అగతముడి అరుణ్, కొత్తూరు ఎంపిటిసి టొంపల తిరుపతి రావు, లోతుగెడ్డ తాతబాబు, పడాల వెంకటకృష్ణ, బోర శ్రీరాములు, హైస్కూల్ హెచ్.ఎమ్ ఎ.గోవిందరావు, వడమ శ్రీనువాసరావు, కొయిలాపు సంజీవురావు, ఇతర టీడీపీ నాయకులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## కొత్తూరులో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం

**కొత్తూరు, ఏప్రిల్ 4 (వార్త):** కొత్తూరులో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య అట్టహాసంగా ప్రారంభించారు. నూతన కార్యాలయాన్ని పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ మామిడి సాయి గణేష్ ప్రారంభించారు. అనంతరం సాయి గణేష్ మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరు అని అన్నారు. కొత్తూరు మండల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు సౌకర్యార్థం ఈ టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. మండలంలోని ఏ ఒక్క టీడీపీ కార్యకర్తకు అయిన ఏ అవసరం వచ్చినా ఈ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. కొత్తూరు మండల నాయకులు కార్యకర్తలు ఏకతాటిపై ఉండి కొత్తూరు మండల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు అగతముడి బైరాగి నాయుడు, కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతినిధి గోగుల వరప్రసాద్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు అగతముడి మాధవరావు, మాతల గాంధీ, అరుణ్ బాబు, కొత్తూరు ఎంపీటీసీ టొంపల తిరుపతిరావు, ముగితి కృష్ణ, సిహెచ్ రాము, కొత్తూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



## నేరాల నియంత్రణ అరికట్టే దిశగా చర్యలు

**మెళియాపుట్టి, ఏప్రిల్ 4 (వార్త):** శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, సంఘవిద్రోహ చర్యలను అరికట్టే దిశగా, పోలీస్ శాఖ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని దీనికి అందరూ సహకరించాలని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు, మెళియాపుట్టి సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబులు ఓ ప్రకటనలో తెలియజేశారు. టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ, నందిగాం, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట, పాతపట్నం, మెలియాపుట్టి, కొత్తూరు, హిరమండలం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలకు నేర నియంత్రణకు పోలీసులు రాత్రి సమయంలో ఖచ్చితమైన గస్తీ, పెట్రోలింగ్ చేపడుతున్నారని, ఇకనుండి ఎటువంటి కారణాలు లేకుండా రాత్రి 11 గంటల తర్వాత తిరిగే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఏదైని తప్పనిసరి, ఎమర్జెన్సీ సమయాల్లో తగిన ఆధారాలతో మాత్రమే రాత్రిపూట బయటకు రాగలరని, పోలీసు వారిచ్చిన ఆదేశాలను తప్పక పాటించి పోలీసులకు సహకరించాలన్నారు.

# గ్రామాలు అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**సంతబొమ్మాళి, ఏప్రిల్ 4 (వార్త):** గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడిందని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. మండలంలో చెట్ల తాండ్ర, సంతబొమ్మాళిలో శుక్రవారం రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధులతో రహదారుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘ నిధులను వేరే వాటికి మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. కూటమి ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టిందని గ్రామాలకు అవసరమైన మౌళిక సదుపాలయ కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాలన్నీ ప్రగతి పథంలో పయనించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. టెక్కలి నుంచి చెట్లతాండ్ర వరకు రూ. ఒక కోటి 43 లక్షల అంచనా వ్యయంతో రహదారి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి వరకు రూ. 2.5 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు నిధులు మంజూరుతో పాటు శంకుస్థాపన చేచడం జరిగిందని అన్నారు. రహదారులు అభివృద్ధి పనులు చేపడుతున్న గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాల్సిందేనని ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరి వరప్రసాద్, ఎల్ ఎల్ నాయుడు జీరు భీమారావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ కంపెనీలకు జిల్లా అనుకూలం






### * ఎన్నారైలకు ఎమ్మెల్యే కూన రవి పిలుపు

**ఆమదాలవలస, ఏప్రిల్ 4 (వార్త):** ఆమదాలవలస ఎమ్మెల్యే, అసెంబ్లీ పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో గూగుల్ ఆఫీస్‌ను సందర్శించారు. సాఫ్ట్ వేర్ రంగంలో అత్యంత క్రియాశీలంగా, వేగంగా దూసుకుపోతున్న ఎ.ఐ టెక్నాలజీ విశిష్టత కోసం గూగుల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్‌తో చర్చించారు. ఎ.ఐ టెక్నాలజీని ఉపయోగించుకుని రాష్ట్రాన్ని విద్యా, వైద్య, సాఫ్ట్ వేర్ అన్ని రంగాల్లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని దీనికి సంబంధించి ఇంజనీరింగ్, ఐటీ, ఎఐ రంగాల కోసం గూగుల్ కంపెనీకి చెందిన పలువురు నిపుణులతో మాట్లాడారు. సాఫ్ట్వేర్ రంగ ప్రాముఖ్యత, సాధిస్తున్న అభివృద్ధిని కొనియాడారు. తెలుగువారు సాఫ్ట్వేర్ రంగంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఉండడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎన్ఆర్ఐలను కలుసుకొని గత వైసీపీ ప్రభుత్వం సాఫ్ట్వేర్ రంగాన్ని ఆంధ్రప్రదేశలో నాశనం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాఫ్ట్వేర్ కంపెనీలకి అనుకూలమైన వాతావరణ కల్పించారని తెలిపారు. రాష్ట్రంలో సాఫ్ట్వేర్ రంగాన్ని అభివృద్ధి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని, అలాగే రాయితీలు కూడా అందజేసేందుకు ముందుకు వస్తున్నారు అని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా తో పాటు ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం సాఫ్ట్వేర్ రంగానికి అనుకూలమైన ప్రాంతంగా ఉందని అన్నారు. విశాఖపట్నం సిటీలో ప్రస్తుతం కొన్ని సాఫ్ట్వేర్ కంపెనీలు ఏర్పాటయ్యా అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు కృషి అన్నారు. భవిష్యత్తులో వీలైనంత ఎక్కువ సాఫ్ట్వేర్ కంపెనీలు ప్రారంభించాలని, యువతకి ఉపాధి కల్పించాలని ఎన్ఆర్ఐలకు విజ్ఞప్తి చేశారు.

## బస్సు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలు

**ఆమదాలవలస, ఏప్రిల్ 4 (వార్త):** తోటాడ రెవెన్యూ పరిధి ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గార మండలం రోలపేటకు చెందిన బాకీ రమణ రోజువారి పనులు నిమిత్తం ఎప్పటి మాదిరిగానే శుక్రవారం పనులు చేపట్టేందుకు ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వస్తుండగా, శ్రీకాకుళం నుండి టెక్కలి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఫ్లైఓవర్ సమీపంలోని ద్విచక్ర వాహనదారుడుని ఢీకొట్టింది. ఈ ఘటనతో రమణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రుడిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బస్సును, డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై సనపల బాలరాజు తెలిపారు.






## ఘనంగా సామూహిక కుంకుమార్చన

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (వార్త):** స్థానిక దాసన్న పేట శ్రీ రామ మందిరంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. 23వ వార్షిక వసంత నవరాత్రి ఉత్సవాలులో భాగంగా తెన్నేటి తేజేశ్వర శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.




## ఎక్సైజ్ ఆధ్వర్యంలో నవోదయం

**కొత్తూరు, ఏప్రిల్ 4 (వార్త):** ఏపీ ప్రభుత్వం ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్మయి ఆధ్వర్యంలో సారా రహిత సమాజాన్ని తయారు చేయటం కోసం నవోదయం 2.0 అనే కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ కొత్తూరు మండలంలో ఉన్న గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తయారు చేయడమే లక్ష్యమన్నారు. అందరూ నాటు సారాకి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎంపిడిఓ పి.నీరజ, డిపార్ట్మెంట్ అధికారులు, పోలీసు శాఖతో పాటు సర్పంచ్ కోయిలాపు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వెలిగిన వీధి దీపాలు



**సంతబొమ్మాళి, ఏప్రిల్ 4 (వార్త):** నౌపడ గ్రామం సాల్ట్ కోలనిలో గత కొద్ది నెలలుగా వీధి దీపాలు వెలగక అంధకారంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీధిలైట్ల సమస్యపై శుక్రవారం పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం వీధిలైట్లను వేశారు. వీధిలైట్ల సమస్య తొలగడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## కారణం లేకుండా రాత్రుళ్లు తిరగొద్దు: సీఐ



**కొత్తూరు, ఏప్రిల్ 4 (వార్త):** కొత్తూరు పరిధిలో ఎటువంటి కారణం లేకుండా రాత్రిపూట తిరిగితే కేసులు పెడతామని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా రాత్రి సమయాల్లో గస్తీ, పెట్రోలింగు నిర్వహిస్తామన్నారు. ఆ సమయాల్లో ఎటువంటి కారణాలు లేకుండా తిరుగుతూ పట్టుబడిన వారిపై చర్యలు తప్పవన్నారు. కొత్తూరు పరిధిలో ఆర్టీసి కాంప్లెక్స్, కొన్ని ముఖ్యమైన జంక్షన్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు.

## మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త):** మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) అభ్యర్థులకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్, శ్రీకాకుళం ఉచిత ఆన్లైన్ శిక్షణను అందించనున్నట్లు సంస్థ సంచాలకులు ఇ.అనురాధ తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) లో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థుల ఎంపిక టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఆదాయం రూ. 2 లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని టీడీపీ భవనం వెనుక ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఈనె 11వ తేదీ లోపు సమర్పించాలని, మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించవచ్చని సంచాలకులు తెలిపారు.

## చందనం తోటకు నిప్పు

ఆమదాలవలస, ఏప్రిల్ 4 (వార్త): బెలమాం పంచాయతీ పరిధి లొద్దలపేట గ్రామానికి చెందిన పూజారి శ్రీలతకు చెందిన 200 చందనం మొక్కలతో పాటు మామిడి, సరుగుడు, ఇతర విలువైన జాతి మొక్కలు మరో 200 అగ్నికి ఆహుతయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉంటారని ఆమె భావిస్తున్నారు. వృత్తిరీత్యా తన భర్త రమణమూర్తి ఉపాధ్యాయుడు కావడంతో ఆమదాలవలసలో ఉంటున్నామని మేము లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారని శ్రీలత చెప్పారు. వీటి విలువ పది లక్షలు ఉంటుందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546